సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

- 26 వరకు భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర
- విజయవంతానికి నోడల్ అధికారుల నియామకం
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్.



సాక్షి,మేడ్చల్ జిల్లా: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై 'భారత్ వికసిత్ సంకల్ప్' యాత్ర ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ నెల 26 వరకు జిల్లాలో చేపట్టనున్న ఈ యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్, అన్న యోజన, దీన్ దయాల్ అంత్యోదయ యోజన, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, జీవనజ్యోతి బీమా యోజన తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని బొమ్మరాసిపేటలో భారత్ వికసిత్ సంకల్ప్ యాత్రను రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ లాంఛనంగా ప్రారంభించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో యాత్రను విజయవంతం చేయాలన్నారు. ప్రతి గ్రామానికి ప్రచార రథం వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారుల చెంతకు చేర్చాలన్నారు. నూతన లబ్ధిదారులను గుర్తించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పేద ప్రజలకు మౌలిక సదుపాయాలైన పారిశుద్ధ్యం, ఆర్థిక సహాయం, ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు, ఇళ్లు, ఆహార భద్రత, పౌష్టికాహారం, విద్య, వైద్యం, విద్య ,స్వచ్ఛమైన తాగు నీరు, నాణ్యమైన విద్య అందించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తుందని, వీటిని అర్హులందరూ సద్వినియోగం చేసుకునేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రచార రథాల ద్వారా జిల్లాలో అన్ని మండలాలు, గ్రామపంచాయతీల్లో ప్రచార కార్యక్రమాలు జరిగేలా.. రూట్ మ్యాప్ , కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సందేశం ఆడియో వీడియోతో పాటుగా ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై కూడా...

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పథకాలపై కూడా ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలందరికీ అవగాహన కల్పించడంతో పాటు అర్హులు పేర్లు నమోదు చేసుకునేలా ప్రోత్సహిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆయా కార్యక్రమాల విజయవంతానికి మండలానికి నోడల్ అధికారులను నియమించడంతో పాటు సంబంధిత శాఖలు చేపడుతున్న కార్యక్రమాలపై కరపత్రాలు, పుస్తకాలు పంపిణీ చేస్తామని, ప్రభుత్వ పథకాలపై అభిప్రాయాన్ని సేకరిస్తారన్నారు. ఈ క్యాంపులకు ప్రజలు హాజరయ్యేలా గ్రామ కార్యదర్శులు గ్రామాల్లో చాటింపు వేయించాలని, కార్యక్రమాల ఫొటోలు, వీడియోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. లబ్ధిదారుల వ్యక్తిగత అనుభవాలను అందరితో పంచుకునేలా చూడాలన్నారు. ముందస్తు సమాచారం ఇచ్చి, ఇందులో ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. కార్యక్రమం విజయవంతానికి నోడల్ అధికారులుగా జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, ఎల్డీఎమ్ శ్రీనివాసులు, జిల్లా సివిల్ సప్లయి అధికారి విజయలక్ష్మీ, డీపీవో రమణమూర్తి వ్యవహరిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

భక్తి భావం పెంపొందించుకోవాలి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తదితరులు

కీసర: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శివసాయి ఎన్‌క్లేవ్, సిద్ధి వినాయకస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్‌లతో కలిసి పాల్గొన్నారు. అంతకుముందు దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడ ప్రజయ్‌సాయి గార్డెన్‌లో నిర్వహించిన అయ్యప్పస్వామి పూజలు, ఎంఎల్‌ఆర్‌కాలనీ అమ్మవారి దేవాలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీతాగౌడ్, వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు స్వప్నహరిగౌడ్, కౌకుట్ల అనంతరెడ్డి, లావణ్య శ్రీనివాస్, కొత్త సురేఖ భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం



గోదాసమేత రంగనాయకస్వామిని దర్శించుకున్న భక్తులు

ఘట్‌కేసర్: ఏదులాబాద్ శ్రీ గోదాసమేత రంగనాయక స్వామి దేవాలయంలో ధనుర్మాస పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అర్చనలు చేశారు. ఆలయ ప్రధాన పూజారి లక్ష్మణాచార్యులు ధనుర్మాస విశిష్టత, ప్రాశస్త్యాన్ని వివరించారు.

పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ముదిరాజ్‌లు

ఘట్‌కేసర్: ఏదులాబాద్‌లో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులకు ఆదివారం భూమి పూజ చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, రైతు బంధు మండల కోఆర్డినేటర్ అంజిరెడ్డి, మాజీ సర్పంచులు యాదగిరియాదవ్, శంకర్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కుమార్‌ముదిరాజ్, లింగంముదిరాజ్, బాలరత్నం, నర్సింగ్‌రావు, సత్తయ్య, రామకృష్ణ, చిరంజీవి, రాజేందర్‌గౌడ్, యుగేందర్, అమర్, పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల



మాట్లాడుతున్న బాలాజీ, రమాబాయి, శంకర్

ఘట్‌కేసర్: ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ నియోజకవర్గ బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి 140 వారం పూలమాల సమర్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అన్నోజీగూడ కపిలవస్తు బుద్ధ విహార్ అధ్యక్షుడు బాలాజీ, ఉపాధ్యక్షురాలు రమాబాయి, ప్రధాన కార్యదర్శి శంకర్ హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించారు. కార్యక్రమంలో నర్సింగ్‌రావు, నారాయణ, గణేశ్, రేఖబాయి, సుశాంత్, సిద్దార్థ్, సిద్దేషు, దుర్గే తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న ముఖ్య అతిథులతో విద్యార్థులు

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, సీఎస్‌ఐ, టాస్క్ సహకారంతో వర్సిటీ బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన కల్పించేందుకు క్యాంపస్ టూ కార్పొరేట్ కనెక్ట్ అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన రిసోర్స్ టెక్నాలజీ సొల్యూషన్స్ సీఈఓ ప్రవీణ్‌కుమార్, ప్రొఫెసర్లు విజయకుమార్, డీన్ మల్లికార్జున్ మాట్లాడుతూ క్యాంపస్ నుంచి కార్పొరేట్ శిక్షణ కార్యక్రమం విద్యార్థులు ఉద్యోగాలు సాధించేందుకు దోహదపడుతుందన్నారు. విజయం సాధించాలంటే సాఫ్ట్ స్కిల్స్ పెంపొందిచుకోవాలన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ సరళ, విద్యార్థులు పాల్గొన్నారు.

లోటస్ ల్యాప్ స్కూల్‌కు ఎక్సలెన్స్ అవార్డు

బోడుప్పల్: బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌కు స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు వరించింది. బ్రెయిన్ ఫీడ్ సంస్థ నుంచి ఈ అవార్డు ప్రకటించగా పాఠశాల చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి హైటెక్ గ్రౌండ్‌లో అవార్డును అందుకున్నారు. అనంతరం గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తమ విద్యా సంస్థలు అనుసరిస్తున్న విద్యాబోధన, లెర్నింగ్ సిస్టిమ్స్, హోలిస్టిక్స్, స్టూడెంట్ డెవలప్‌మెంట్ ఆధారంగా ఈ అవార్డు వచ్చిందన్నారు. ప్రతి విద్యార్థి నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని ముందుకు నడవాలన్నారు. ఈ అవార్డుతో తమ బాధ్యత మరింత పెరిగిందన్నారు.

ఆటో కార్మికుల సదస్సును విజయవంతం చేయాలి

మల్లాపూర్: తెలంగాణ ఆటో మోటర్స్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 19న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న ఆటో కార్మికుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య అన్నారు. ఆదివారం నాచారం హెచ్ ఎంటీనగర్‌లో సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఉపాధి కోల్పోతున్న ఆటో కార్మికులు, డ్రైవర్లు పోరాటాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం వెంటనే నెలకు రూ15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు పి.నారాయణ, విజయ్‌కుమార్, నిరంజన్, దాసు, రమేస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపన





పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, తదితరులు

కీసర: కీసరలో నిర్మించిన శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూజల్లో ముఖ్య ఘట్టమైన అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, గోపూజ, గర్భన్యాసం, కళాన్యాసం, శ్రవణ నక్షత్రంలో తులాలగ్నంలో అయ్యప్పస్వామి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని భక్తులు, అయ్యప్ప దీక్షదారుల సమక్షంలో కనుల పండువగా నిర్వహించారు. రామిడి విజయ్‌రెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం అయ్యప్ప దీక్షదారులు అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్, కీసర సర్పంచ్ మాధురి, ఉపసర్పంచ్ లక్ష్మణ్, కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం రమేష్, మాజీ ఎంపీటీసీ సభ్యులు బెలిదే రమేష్ గుప్తా, మచ్చాని జంగయ్యయాదవ్, మాజీ ఉపసర్పంచ్ రాయిల శ్రావన్‌కుమార్ గుప్తా, గురుస్వాములు నల్లబాల్‌రెడ్డి, బొడుసురమేష్‌యాదవ్, మొర్గుయాదగిరి, అయ్యప్పదీక్షదారులు గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న ప్లాట్ల యజమానులు

ఘట్‌కేసర్: రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించి ప్లాట్లను ఆక్రమించేందుకు యత్నిస్తున్న వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకోవాలని బింగి యాదమ్మ వెంచర్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని చౌదరిగూడ సాదత్‌అలీగూడ సర్వేనంబర్ 715లోని వెంచర్ ప్లాట్ల యజమానుల ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరసింహ అనే వ్యక్తి, కొందరు రియల్టర్లు, బిల్డర్లు కుమ్మక్కై వెంచర్‌లోకి వెళ్లకుండా గోడ నిర్మించడంతో పాటు తమ ప్లాట్లు కబ్జా చేశారని ఆరోపించారు. వెంచర్‌పై నకిలీ లే అవుట్ చేసి ప్లాట్లు విక్రయిస్తున్నారని, దీనిపై పంచాయతీరాజ్ అధికారులు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని కాలనీల్లో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ సత్యరాఘవేంద్ర కాలనీ, సత్తిరెడ్డినగర్, బీజెఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల నుంచి ముంపు సమస్య, డ్రైనేజీ సమస్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బండచెరువు క్రింది ప్రాంతం నుండి నాలా విస్తరణ పనులు పూర్తి కాకపోవడానికి ఇబ్బందులు ఉన్నట్లు ఇటీవల సమన్వయ కమిటీ సమావేశంలో అధికారులు తెలియజేశారన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని ముంపు సమస్య పరిష్కరించేందుకు శాస్త్రీయంగా, సాంకేతికంగా నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. త్వరలోనే సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జెఎంసీ కార్పొరేటర్ మురుగేష్, కేబుల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

కేంద్ర మంత్రులకు కరుణా గోపాల్ వినతి



అల్వాల్: మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో మౌలిక వసతులు కల్పించాలని భారతీయ జనతాపార్టీ సీనియర్ నాయకురాలు కరుణా గోపాల్ అన్నారు. ఈ మేరకు న్యూ ఢిల్లీలో ఆదివారం కేబినెట్ మంత్రులను కలిసి విన్నవించారు. సఫిల్‌గూడ లెవల్ క్రాసింగ్(ఎల్‌సీ 254) మూసివేత కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లారు. సనత్‌నగర్ మీదుగా మౌలాలి, హైటెక్‌సిటీల మధ్య ప్రతిపాదిత ఎంఎంటీఎస్ ఫేజ్–2 ప్రాజెక్ట్ పనులు చేపట్టాలని కోరారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరితో జరిగిన సమావేశంలో ప్రస్తుత మెట్రో రైల్ నెట్‌వర్క్‌ను మల్కాజిగిరి/ఈసీఐఎల్/త్రిముల్గేరి/బోయిన్‌పల్లి/ బొల్లారం తదితర ప్రాంతాలకు విస్తరించాలన్నారు. రామకృష్ణపురం ఫ్లైఓవర్‌ను 4 లేన్లుగా విస్తరించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రులు హామీ ఇచ్చారు. ఎల్‌సీ 254 సమస్యపై అధ్యయనం చేసి వీలైనంత త్వరగా పరిష్కరించాలని వైష్ణవ్ వైష్ణవ్ అధికారులను ఆదేశించారు. హర్దీప్ సింగ్ పూరి కూడా సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు కరుణాగోపాల్ తెలిపారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మండలంలోని బండమాదారం సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా సోమవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ పవన్‌చందు తెలిపారు. రాయిలాపూర్, గిర్మాపూర్ గ్రామాల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదన్నారు.

నేడు క్షేత్రగిరి వాహనాల పార్కింగ్ వేలం

మేడ్చల్: మండలంలోని ఘనాపూర్ క్షేత్రగిరి గుట్టలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించే వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కొండపైన వాహనాల పార్కింగ్ కోసం సోమవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆలయం వద్ద నిర్వహించే బహిరంగ వేలంలో నిబంధనలకు లోబడి ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు.

కుంగ్‌ఫూ పోటీల్లో మేడ్చల్ విద్యార్థుల ప్రతిభ

మేడ్చల్: నగరంలోని చింతల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే కుంగ్‌ఫూ పోటీల్లో మేడ్చల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మేడ్చల్ కు చెందిన యూనివర్సల్ 369 అకాడమీ విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించారు. అకాడమీకి చెందిన జ్ఞాపిక, రోజీ, కృష్ణప్రియ, నిత్యశ్రీ, చరణ్, తబరేజ్, మున్నాకుమార్ బంగారు, వెండి పతకాలు సాధించారు. వారిని అకాడమి చైర్మన్ సాయికుమార్ ,కోచ్ లు అభినందించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

మేడిపల్లి: గుర్తు తెలియని వాహన ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బిషన్‌కుమార్(24) నగరానికి వలస వచ్చి బోడుప్పల్ భవానీ నగర్‌లో నివాసముంటూ ర్యాపిడో బైక్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 11న రాత్రి కస్టమర్‌ను పికప్ చేసుకునేందుకు బోడుప్పల్ ఎస్ఆర్ జూనియర్ కళాశాల సమీపంలో రోడ్డు పక్కన వేచి చూస్తుండగా వెనుకనుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలైన బిషన్‌ను స్థానికులు 108లో మేడిపల్లి లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనమేరకు గాంధీ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సహజయోగ ఆధ్యాత్మిక వేడుకలు

మేడిపల్లి: శ్రీ మాతా నిర్మలాదేవి సహజయోగ మేడిపల్లి కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ యువశక్తి సమ్మేళనం రెండో రోజు ఆదివారం సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యువతలో భక్తిభావన, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు దేశంలోనే మొట్ట మొదటి సారిగా పీర్జాదిగూడ శ్రీ ఫణి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సహజయోగ యువశక్తి సమ్మేళనంలో భాగంగా నిర్వాహకులు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన భక్తి గీతాలకు యువత నృత్యాలు చేశారు.

రమాదేవి మృతి తీరని లోటు

మేడిపల్లి: కామ్రేడ్ రమాదేవి మృతి పార్టీకి తీరని లోటని పలువురు సీపీఐ నేతలు అన్నారు. ఆదివారం పీర్జాదిగూడ, మల్లికార్జున నగర్ కాలనీలో సీపీఐ మాజీ కార్యదర్శి బాలరాజ్ సతీమణి పీర్జాదిగూడ గ్రామ పంచాయతి మాజీ వార్డు సభ్యురాలు కామ్రేడ్ రమాదేవి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి డి.జి సాయిలు గౌడ్ మాట్లాడుతూ.. కామ్రేడ్ రమాదేవి మరణం పార్టీకి తీరని లోటని, ఒక మంచి నాయకురాలిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఉమామహేష్, రచ్చకిషన్, తోటపల్లి శంకర్,ఆర్ కృష్ణమూర్తి,సామ వెంకట్ రెడ్డి, హరినాథ్ రావు, ప్రమీల, ఈశ్వర్, పూర్ణచందర్, నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ



మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి శివాలయంలో అయ్యప్ప స్వాములు ఆదివారం అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఎల్లంపేట్, అత్వెల్లి, మేడ్చల్‌కు చెందిన అయ్యప్ప స్వాములు ఆధ్వర్యంలో ఈ సామూహిక పడిపూజ కార్యక్రమం జరిగింది. ఆలయంలో మహాపడి ని అలంకరించి 12 మంది అయ్యప్ప స్వాములు ఏక కాలంలో పడిని వెలిగించారు. గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి అభిషేకాలు నిర్వహించారు. పూజ అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గురు స్వాములు రామకృష్ణరాజు, లోక్ నాథ్, విజయ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, అశోక్‌గౌడ్ ,హరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చైతన్యనగర్ కాలనీ కార్యవర్గం ఎన్నిక



చైతన్యనగర్ కాలనీ కార్యవర్గ సభ్యులు

ఘట్‌కేసర్: కొర్రెముల్ చైతన్యనగర్ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో కాలనీ నూతన అధ్యక్షుడిగా మాధవరావు, ఉపాధ్యక్షుడిగా శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్, సభ్యుడిగా యాదగిరిని ఎన్నుకున్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం వారు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని, కాలనీ వాసులు తమకు సహకరించాలని కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా రాణించాలంటే ఇలాంటి శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, ఎస్‌జీఓ అధికారి సుచిత్ర, కౌన్సిలర్ బిజ్జశ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు, లింగం సాయినాథ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

ఆల్వాల్: వెంకటాపురం డివిజన్ పరిధిలో షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి పథకాలకు ఎంపికైన లబ్ధిదారులకు స్థానిక కార్పొరేటర్ సబితా కిషోర్‌తో కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదివారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఆడపిల్లల కోసం ప్రవేశపెట్టిన షాదీముబారక్, కల్యాణ లక్ష్మి పథకాలను ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో అనిల్ కిషోర్, శ్రీధర్‌గౌడ్ ,దేవేందర్‌గౌడ్, సయ్యద్ మోసిద్దీన్, మోసే పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్స్‌డే

గౌతంనగర్: సెంట్రల్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫోరం మల్కాజిగిరి ఆధ్వర్యంలో ఆదివారం మధుసూదన్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో పెన్షనర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మల్లేష్, ప్రధాన కార్యదర్శి డి.సుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 1979లో పింఛన్‌దారులకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన జీవోను సుప్రీం కోర్టు కొట్టివేసిందన్నారు. పింఛన్‌దారులకు అనుకూలంగా తీర్పు రావడంతో డిసెంబర్ 17ను పెన్షనర్స్‌డేగా జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో బ్రహ్మయ్య, సూర్యనారాయణ,చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసాయినగర్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక

బోడుప్పల్: శ్రీసాయినగర్ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం నిర్వహించిన కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో అధ్యక్షులుగా ఆర్. జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎల్. సంతోష్ కుమార్ నాయక్, కోశాధికారిగా బి. చంద్రశేఖర్ విజయం సాధించారు. కాలనీలో మొత్తం 199 ఓట్లు ఉండగా, 171 ఓట్లు పోలయ్యాయి. జనార్దన్‌రెడ్డి ప్యానల్‌కు 105 ఓట్లు, లింకన్ ప్యానల్‌కు 66 ఓట్లు వచ్చాయి. ఎన్నికల అధికారులు జనార్దన్‌రెడ్డి ప్యానల్ గెలుపొందినట్లు ప్రకటించారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ నాయక్ మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కాలనీ ప్రజల భాగస్వామ్యంతో ముందుకు వెళతామని, కాలనీ ప్రజలందరూ తమకు సహకరించాలని కోరారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు విశేష స్పందన

ఆల్వాల్: ఆల్వాల్‌లో ఆల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలింపియాడ్ (అమాట్) ఆధ్వర్యంలో నిర్వహించిన టెస్ట్‌కు విశేష స్పందన లభించింది.ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నగరంలోని పలు కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. 12,600 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారన్నారు. వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ నెల 23న బహుమతులు అందజేస్తామన్నారు.